క్లుప్తంగా

అధినేత జగన్‌తో ఆత్మీయ సమావేశానికి తరలిన నేతలు

రేపల్లె రూరల్: రేపల్లె నియోజకవర్గంలోని తాజా పరిణామాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యనేతల సమావేశానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరు గణేష్ ఆధ్వర్యంలో గురువారం అధిక సంఖ్యలో ముఖ్యనాయకులు తరలివెళ్ళారు. తరలివెళ్ళిన వారిలో చెరుకుపల్లి ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, నాయకులు యార్లగడ్డ మదన్ మోహన్, చిమటా బాలాజీ, చిత్రాల ఓబేదు, నీలా నాంచారయ్య, కామినేని కోటేశ్వరరావు, కాటూరి శివనాగబాబు, ఇంకొల్లు రామకృష్ణ, పాగోలు వెంకటేశ్వరరావు, ఉప్పాల వెంకటేశ్వరరావు, లుక్కా బాపనయ్యలతోపాటు 150 మంది ముఖ్యనాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఆ అధికారులపై చర్యలు తీసుకోండి

బాపట్ల: ఎస్సీ, ఎస్టీ కేసుల్లో రిపోర్టులు పంపని తహసీల్దార్లపై చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు గురువారం కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన కలెక్టర్‌ను కలిశారు. రిపోర్టులు పంపకుండా అధికారులు జాప్యం చేయటం వల్ల బాధితలకు సాయం అందటంలేదని వివరించారు. జాప్యంపై విచారణ జరిపించాలని కోరారు. కలెక్టర్ మురళిని కలిసిన వారిలో మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ, రాష్ట్ర గిరిజన బహుజన సంఘం అధ్యక్షుడు గంటా సుబ్బారావు ఉన్నారు.




భట్టిప్రోలులో విజయదుర్గాదేవి అలంకారంలో పార్వతి దేవి



రేపల్లెలో కనకదుర్గమ్మగా గ్రామదేవత బూరుగులమ్మ



ఐలవరంలో దుర్గాదేవిగా కనకదుర్గ అమ్మవారు



బాపట్ల కోన ప్రభాకరరావు కళాక్షేత్రంలో..



బాపట్ల మహర్షి గోశాలలో..

కనకదుర్గా నమోస్తుతే

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎనిమిదో రోజు గురువారం అమ్మవారి ఆలయాలు కిటకిటలాడాయి. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను కటాక్షించారు. కొన్నిచోట్ల కనకదుర్గగా కరుణించారు. భక్తులు అమ్మ దివ్య మంగళ స్వరూపాన్ని కనులారా తిలకించి పులకించారు.

– భట్టిప్రోలు/రేపల్లె రూరల్/కర్లపాలెం/బాపట్ల టౌన్:



రేపల్లెలో దుర్గమ్మగా దర్శనమిస్తున్న భ్రమరాంబ



కర్లపాలెం మండలం కొత్త నందాయపాలెంలో ప్రత్యేక అలంకారం



రేపల్లెలో దుర్గమ్మగా దర్శనమిస్తున్న వాసవీమాత



భట్టిప్రోలులో కనకదుర్గాదేవి అలంకారంలో వాసవీ అమ్మవారు



బాపట్ల సత్యనారాయణస్వామి ఆలయంలో కనకదుర్గమ్మ అలంకరణ

దండి పార్వతీమాతకు తెప్పోత్సవం



వెల్లటూరు చానల్‌లో తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భట్టిప్రోలు: విజయదశమి సందర్భంగా భట్టిప్రోలు గ్రామ దేవత దండి పార్వతి అమ్మవారికి గురువారం పవిత్ర కృష్ణా జలాల్లో తెప్పోత్సవం నిర్వహించారు. భట్టిప్రోలు కాపు సంఘం ఆధ్వర్యంలో అమ్మవారిని స్థానిక దేవాలయం వద్ద నుంచి మేళ తాళాలు, కనక తప్పెట్ల మధ్య వెల్లటూరు చానల్ వద్దకు తీసుకెళ్లి తెప్పోత్సవం నిర్వహించారు. ఆ తర్వాత అమ్మవారిని గ్రామంలో ఊరేగించారు.

భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు

రేపల్లె రూరల్: రేపల్లె పట్టణంలో భవన నిర్మాణాలకు తప్పనిసరిగా టౌన్‌ప్లానింగ్ అనుమతులు పొందాలని మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ప్లానింగ్ లేకుండా గతంలో నిర్మించిన నిర్మాణాల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తున్నామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలకు, నిర్మించబోయే వాటికి ప్లాన్ తప్పనిసరిగా తీసుకోవాలని చెప్పారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనధికార లేఅవుట్‌లను గుర్తించామని చెప్పారు. ఈ లేఅవుట్లను ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): పిట్టలవానిపాలెం మండల కేంద్రంలోని రెడ్లపాలెం గ్రామంలో పెరుమాళ్ల శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులకు రాష్ట్ర మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి కుమారుడు వైఎస్సార్ సీపీ నాయకులు గాదె మధుసూదనరెడ్డి రూ.10వేలు అందజేశారు. పెరుమాళ్ల శ్రీనివాసరెడ్డి ఇటీవల పాముకాటుకు గురై మృతిచెందిన విషయం తెలుసుకున్న గాదె మధుసూదనరెడ్డి వారి ఇంటికి వెళ్ళి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట గోవతోటి విజయ్ దేగల రవిరెడ్డి, కుంచాల వీరరాఘవరెడ్డి, అలవల అశోక్‌రెడ్డి, తుమ్మాశివారెడ్డి తదితరులు ఉన్నారు.

14 నుంచి పంచాయతీ వారోత్సవాలు

రేపల్లె రూరల్: మండలంలో ఈ నెల 14 నుంచి 20 వ తేదీ వరకు పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.శోభారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలకు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నిర్దేశించిన తేదీలలో షెడ్యూలు ప్రకారం కమిటీలు ఆయా గ్రామాలలో కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు

– కమిషనర్ రఘునాథరెడ్డి



సమ్మర్‌స్టోరేజీ ట్యాంకును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

బాపట్ల: ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు శక్తివంచనలేకుండా పని చేయాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సూచించారు. బాపట్ల మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి గురువారం పట్టణంలోని పలు వార్డులు సందర్శించటంతోపాటు సమ్మర్ స్టోరేజీ ట్యాంకును పరిశీలించారు. పట్టణంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని సూచించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. కమిషనర్‌తోపాటు ఏఈ ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కరుణ, శ్రీనివాసరావు ఉన్నారు.

భట్టిప్రోలు పోస్టాఫీసులో ఆధార్ క్యాంపు

భట్టిప్రోలు: భారతీయ తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోస్టల్ వారోత్సవాలలో భాగంగా తెనాలి డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ కరుణాకర్ బాబు ఆదేశానుసారం గురువారం భట్టిప్రోలు పోస్టాఫీస్‌లో నిర్వహించిన ఆధార్ క్యాంప్‌కు అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా సబ్ పోస్ట్‌మాస్టర్ సయ్యద్ నజీర్ నూతన ఆధార్ నమోదు, ఆధార్ సవరణలు చేశారు. 53 మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ భాగ్యరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బాబా ఆలయానికి దాతల సహకారం

భట్టిప్రోలు: భట్టిప్రోలు రథం సెంటర్‌లో కొలువైన షిర్డీ సాయిబాబా ఆలయం అభివృద్ధికి దాతలు రూ.లక్ష వ్యయం చేసే వస్తువులను అందజేశారు. గ్రామ పంచాయతీ పరిధిలోని అద్దేపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు నిర్మలాదేవి దంపతులు ఏసీని బహూకరించారు. అలాగే భట్టిప్రోలుకు చెందిన మద్దుల భాస్కరన్ జ్ఞాపకార్థం ఆయన ధర్మపత్ని ఉదయశ్రీ, కుమారుడు సోమశేఖర్-రోహిత దంపతులు సీలింగ్ చేయించారు. గురువారం దాతలను పాలకవర్గ అధ్యక్షులు తమ్మన రమేష్‌బాబు, కమిటీ నిర్వాహకులు, సభ్యులు ఘనంగా సత్కరించారు.

ముగిసిన శిక్షణ తరగతులు

భట్టిప్రోలు: ఏపీఎస్ఐఆర్డీ ఆదేశానుసారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నుంచి ప్రారంభమైన ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. రిసోర్స్ పర్సన్స్ వక్కలగడ్డ సురేష్‌బాబు, అడుగోపుల వెంకటేష్‌బాబు, మంచి కోటేశ్వరరావు పంచాయతీ విధులు, బాధ్యతలు, అధికారాలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్.జలజ పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

బాపట్ల: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయమ్మ పేర్కొన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వెదుళ్ళపల్లి హాస్పిటల్‌లో గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. వారికి పౌష్టికాహారం అందుతున్న తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన దేవరకొండ రామును అభినందించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మానసాప్రియదర్శి, వైష్ణవి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిషాసురమర్దిని ఛాయాచిత్రాల ప్రదర్శన



మోదుకూరులో ఏర్పాటైన ఛాయాచిత్ర ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభించిన డాక్టర్ హైమావతి దంపతులకు సత్కారం

మోదుకూరు(తెనాలి): బాపట్ల జిల్లా చుండూరు మండలం మోదుకూరు గ్రామంలో శ్రీకనకదుర్గ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేశవిదేశాల్లోని వివిధ శతాబ్దాలనాటి అపురూపమైన మహిషాసురమర్దిని ఛాయాచిత్రాల ప్రదర్శనను ఏర్పాటుచేశారు. యువ పురావస్తు పరిశోధకుడు పాములపాటి శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని వేమన సాహిత్య వికాస పరిషత్ భవనంలో ఏర్పాటైన రెండురోజుల ప్రదర్శనను గురువారం కాకతీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు డాక్టర్ పోలవరపు హైమావతి ప్రారంభించారు. ఆయా శిల్పచిత్రాలకు చెందిన వివరాలను శ్రీనాథ్‌రెడ్డి సందర్శకులకు వివరించారు. డాక్టర్ హైమావతి మాట్లాడుతూ ఈ ఛాయాచిత్రాలను సేకరించటం గొప్ప విషయమన్నారు. అలాంటి అపురూప ఛాయాచిత్రాలను దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రదర్శించటం భక్తులకు మంచి అనుభూతిని కలిగిస్తుందన్నారు. ప్రదర్శన ఏర్పాటు చేసిన శ్రీనాథ్ రెడ్డిని అభినందించారు. రెండురోజులపాటు జరిగే ఈ ప్రదర్శన శుక్రవారం రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. ప్రజలు, భక్తులు తిలకించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డాక్టర్ హైమావతి దంపతులను సత్కరించారు. ఫోటోజెనిక్ ఆర్ట్ సర్కిల్ వ్యవస్థాపక కార్యదర్శి కానాల సుధాకర్‌రెడ్డి, బౌద్ధ పరిశోధకుడు తీయగూరి సీతారామరెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): అధికారులు, ప్రజా ప్రతినిధులు అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు చెప్పారు. పిట్టలవానిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇన్‌చార్జ్ ఎంపీడీవో దెందుకూరి సీతారామరాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు మాట్లాడుతూ అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.